

సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలో భ్రమరాంబాదేవికి శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఊయలసేవ నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పం పఠించారు.



కౌలురైతుకు పెట్టుబడి భరోసా

కౌలురైతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 16,486 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 8లో

న్యూస్‌రీల్

వైఎస్ఆర్ పెన్షన్ కానుకకు రూ.127.29 కోట్లు

- ఆగస్టు నెలతో పోలిస్తే రూ.2,68,71,000 పెరిగిన బడ్జెట్

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద సెప్టెంబర్ నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.127,29,80,750 విడుదలయ్యాయి. ఆగస్టు నెలలో రూ.124,61,09,750 కేటాయించగా.. కొత్త పింఛన్లు మంజూరు కావడంతో బడ్జెట్ రూ.2,68,71,000 పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ఆగస్టు నెలలో 4,49,722 పింఛన్లు ఉండగా.. సెప్టెంబర్ నెలలో 4,59,333కు చేరింది. కొత్తవాటితో సహా పింఛన్లను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీకి అవసరమైన నిధులను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, డీఆర్‌డీఏ అదనపు పీడీ షరీఫ్ బ్యాంకర్లకు సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించనున్నారు. వీటి నిర్మాణంతో వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకిపోయి చుట్టుపక్కల బోర్లలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ప్రతి మండలంలోని 10 ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలనేది లక్ష్యం. ఈ ప్రకారం జిల్లాలో 250 నిర్మించడానికి చర్యలు చేపట్టారు. మూడు మీటర్ల లోతు, 2.40 మీటర్ల పొడవు, 2.40 మీటర్ల వెడల్పుతో వీటిని నిర్మిస్తారు. ఇప్పటి వరకు 162 రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణానికి ఎస్టిమేట్లు వేశారు. ఇందులో 54 మంజూరు అయ్యాయని, త్వరలో పనులు చేపడతామని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. ఒక్కో రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చరుకు ఉపాధి నిధులు రూ.60 వేల వరకు ఖర్చు చేయనున్నట్లు ఆయన బుధవారం విలేకరులకు తెలిపారు.

పట్టుపరిశ్రమ శాఖలో పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్): పట్టుపరిశ్రమ శాఖలో పలువురికి పదోన్నతులు లభించాయి. కర్నూలు జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కుసుమకుమారికి సెరికల్చర్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆత్మకూరు ఏడీ ఆఫీసుకు బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లాలో సాంకేతిక అధికారులుగా పనిచేస్తున్న లింగమూర్తి, ఆనందరావు, ప్రసాద్‌రావులకు అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్లుగా పదోన్నతులు లభించాయి. వీరు నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లాలో సాంకేతిక అధికారులుగా పనిచేస్తున్న విజయకుమార్, ఎంవీ రమణయ్య, మహబూబ్‌బాషా, జీవీ రమణారెడ్డి, సోమన్నలకు అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్‌గా పదోన్నతులు లభించాయి. వీరిలో ముగ్గురు పదోన్నతిపై కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. మిగిలిన ఇద్దరు నంద్యాల జిల్లాలోనే పదోన్నతిపై పోస్టింగ్‌లు పొందారు.

డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

కర్నూలు సిటీ: డీఎడ్ 2021–23 రెగ్యులర్ బ్యాచ్ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షలు, గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షల ఫీజు చెల్లింపు గడువు నేటి(గురువారం)తో ముగియనున్నట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో వచ్చే నెల 7వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాలని, ఫీజులు చెల్లించిన వారికి వచ్చే నెల 19 నుంచి 25వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ పేర్కొన్నారు.

అందుబాటులో జొన్న(పొట్టిరకం) విత్తనం



నంద్యాల(సెంట్రల్): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్)లో పొట్టి జొన్న రకమైన ఎన్‌టీజే–5 అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు పరిశోధనా స్థానం సహ సంచాలకులు ఎస్.సి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రకం విత్తనాన్ని జిల్లా పరిధిలో మాఘీ సీజన్(సెప్టెంబర్) నుంచి లేట్ సీజన్(నవంబర్) వరకు నాటుకోవచ్చన్నారు. దీని పంట కాలం 95–100 రోజులు ఉంటుందని, సరాసరి దిగుబడి ఎకరానికి 18–20 క్వింటాళ్ల వరకు ఉంటుందన్నారు. మొత్తం 85 క్వింటాళ్ల పునాది విత్తనం అందుబాటులో ఉందని.. అన్నదాతలు ఈ విత్తనాన్ని కొనుగోలు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు.

చూపులు కలవక.. మనసులు ముడిపడక!

స్థిరపడటం అంటే.. బాగా డబ్బు సంపాదించడం, కారు, బంగ్లాలు ఉండటం ఒక్కటే కాదు.. పెళ్లి చేసుకున్నప్పుడే ఆ జీవితం సంపూర్ణమవుతుంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండటం, బంధుత్వాలకు విలువ ఇస్తుండటంతో పెళ్లి చేయాలనే ఆలోచన వస్తే చాలు.. ఎక్కడెక్కడ పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలు ఉన్నారో, అబ్బాయిల వివరాలు ఇట్టే తెలిసిపోయేవి. క్షణాల్లో మాట కలపడం.. ఆ తర్వాత ముహూర్తాలు పెట్టేసుకోవడం, రెండు మనసులను ముడివేయడం చకచకా జరిగిపోయేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పెళ్లంటే.. తల్లిదండ్రులు ఒకస్థాయి యుద్ధం చేయాల్సిందే. కులం, గోత్రం.. జాతకం.. ఆస్తులు.. అంతస్తులు.. గుణగణాలు.. ఇవన్నీ తలుచుకుంటే గుండె పగిలినంత పనవుతుంది. సంబంధం చూడటం మొదలు.. పెళ్లి పూర్తయ్యే వరకు సవాలక్ష సవాళ్లు. – సాక్షి, కర్నూలు డెస్క్



పెళ్లీడు గండాలు

- ఉద్యోగంలో స్థిరపడనిదే అబ్బాయిలు ససేమిరా
- అక్కరకు రాని తల్లిదండ్రుల అభిప్రాయం
- వయస్సులో జరుగుతున్న పెళ్లిళ్లు తక్కువే..
- ఆస్తులు, అంతస్తులకే అధిక ప్రాధాన్యం
- ఎదురుకట్నంకు సిద్ధమవుతున్న పెళ్లికాని ప్రసాదులు
- ఇప్పుడిప్పుడే తెరపైకి ఏజెంట్ల వ్యవస్థ

పిల్లలు పెద్దవాళ్లు అవుతుంటే సంతోషంగా ఉంటుంది. ఉద్యోగాలు సంపాదిస్తే ఇక భయం లేదనిపిస్తుంది. ఆ తర్వాత వయస్సు గుర్తుకు వస్తే మాత్రం తల్లిదండ్రులకు కంటి మీద కునుకు దూరమవుతుంది. ఆధునిక ప్రపంచంలో అమ్మాయి, అబ్బాయిల్లో మొదట జీవితంలో స్థిరపడాలనే భావన అధికంగా కనిపిస్తుంది. ఆ తర్వాత పెళ్లి అనడం పరిపాటిగా మారింది. ఈ కోవలో చదువు పూర్తయ్యే సరికి సుమారు 25 ఏళ్లు వచ్చేస్తున్నాయి. ఆ తర్వాత ఉద్యోగంలో కుదురుకోవాలంటే మరో ఐదేళ్లు ఆవిరి కావాల్సిందే. కొందరు త్వరగానే దారిలో పడుతున్నా.. చాలా వరకు అమ్మాయిలు, అబ్బాయిలు చదువు, ఉద్యోగం వెంట పరుగులు తీస్తూ తమ వయస్సు కరిగిపోతుందనే విషయాన్నే మర్చిపోతున్నారు. తీరా ఉద్యోగం వస్తే.. అప్పుడు పెళ్లి ఆలోచన మొదలైనా తల్లిదండ్రులు వేట మొదలు పెడితే అప్పటికి కానీ అర్థం కావట్లేదు ముదిరిపోయామని. వయస్సు ఎంత? ఈ ప్రశ్న అవతలి వైపు నుంచి వస్తే చాలు ఇక పెళ్లి కావడం కష్టమనిపిస్తుంది. ఇక ఆ తర్వాత కూడా గొంతెమ్మ కోర్కెలతో కాలం గిర్రున తిరుగుతుంది. ఒక్కో సంవత్సరం గడిచేకొద్దీ పెళ్లి అయితే చాలన్నట్లుగా తయారవుతుంది వ్యవహారం.

పిల్లలు చెప్పినట్లు వినాల్సిందే..

గతంలో తల్లిదండ్రులు ఓ సంబంధం చూసి పెళ్లి చేసుకోమంటే మారు మాట్లాడకుండా పీటలు ఎక్కేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. పెద్దల మాట కంటే.. పిల్లల అభిరుచికే ప్రాధాన్యం ఉంటోంది. ఒకరికొకరు నచ్చాలి. మాటామాట కలవాలి. డిన్నర్లు, డేటింగ్‌లు.. తలుచుకుంటే బుర్ర గిర్రున తిరుగుతుంది. ఇక కులగోత్రాలు, జాతకాలు సరేసరి. చదువు, ఉద్యోగ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తుండటం.. అన్నీ సరిపోయాయి అనుకున్నా చివరి నిముషంలో ఏదో ఒక వెలితి బయటకు రావడంతో ఆ సంబంధం అక్కడితో ముగిసిపోతుంది. ఇలా వాళ్ల కోర్కెలకు అనుగుణంగా సంబంధాలు వెతికేందుకు తల్లిదండ్రులు చుక్కలు చూడాల్సి వస్తోంది. అతి కష్టం మీద సబంధం తీసుకొచ్చినా సాకులు చెప్పడంతో వ్యవహారం మళ్లీ మొదటికొస్తుంది. ఈ కారణంగా పెళ్లిళ్లు ఆలస్యమవుతుండటంతో ఇంట్లో సంతోషం ఆవిరవుతుంది.

ఏజెంట్ వ్యవస్థ

ఉన్న ప్రాంతాల్లో కోరుకున్న సంబంధాలు కుదరక ఇతర ప్రాంతాలకూ వెళ్తున్నారు. చివరకు కులాల ప్రస్తావన మర్చిపోయి సంబంధం దొరికితే చాలు అనుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఇందుకోసం శ్రీకాకుళం, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర ప్రాంతాల్లోనూ కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతున్నారు. పెళ్లి కొడుకు తరఫున అమ్మాయికి భరణం చెల్లించి మరీ సంబంధం కుదుర్చుకుంటున్నారు. శ్రీకాకుళం పరిసర ప్రాంతాల నుంచి సంబంధం కుదిర్చేందుకు ఏకంగా ఏజెంట్ వ్యవస్థ ఏర్పాటైంది. రూ.2లక్షల నుంచి రూ.3లక్షల మేర వీళ్లకు ముట్టజెబితే కానీ సంబంధం దొరకని పరిస్థితి.



కర్నూలు నగరానికి చెందిన ఓ యువకునికి రెండేళ్ల క్రితం ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. వయస్సు 27 ఏళ్లు. తల్లిదండ్రులు పెళ్లి చేద్దామని నిర్ణయించుకొని అమ్మాయి కోసం వెతకటం మొదలు పెట్టారు. అయితే వెళ్లిన ప్రతిచోటా సొంత ఇల్లు ఉందా? భూమి ఎంతుంది? ఇలాంటి ప్రశ్నలే కానీ అబ్బాయి గుణగణాలు, కుటుంబ నేపథ్యం ప్రస్తావనే రాకపోవడం గమనార్హం.

ఆళ్లగడ్డకు చెందిన ఓ యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా బెంగళూరులో పని చేస్తున్నాడు. అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ అయ్యుండాలనే నిబంధన పెట్టడంతో తల్లిదండ్రులు అష్టకష్టాలు పడి ఓ అమ్మాయితో ఆరు నెలల క్రితం ఎంగేజ్‌మెంట్ చేశారు. ఆ తర్వాత తాను ఎప్పుడు ఫోన్ చేసిన అమ్మాయి ఫోన్ ఎంగేజ్ వస్తుందనే కారణంతో ఈ బంధం అక్కడితో ముగిసిపోయింది.

వయస్సులో జరుగుతున్న పెళ్లిళ్లు అంతంతే..

పెళ్లి వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు. ఈ వయస్సులో జరుగుతున్న పెళ్లిళ్లు ఇప్పుడు దాదాపుగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. పట్టణాల్లో ఈ వయస్సు పెళ్లిళ్లు చాలా అరుదు. చదువు, ఉద్యోగం అనుకోవడంతోనే వయస్సు చేజారిపోతుంది. ఈ కారణంగా పెళ్లిళ్లు ఆలస్యమవుతూ ఒకరినొకరు అర్థం చేసుకోలేక గొడవలకు దారితీస్తుంది. ఇరువురి వయస్సులో వ్యత్యాసం కూడా సగం పెళ్లిళ్లను విడాకుల వరకు తీసుకెళ్తోంది.

అబ్బాయిల తల్లిదండ్రుల్లోనే ఆందోళన

అసలే అమ్మాయిల కొరత. అబ్బాలు చదువు, ఉద్యోగం అని కాలం గడిచే కొద్దీ వయస్సు పెరిగి, అందుకు తగిన అమ్మాయి దొరక్క తల్లిదండ్రులు చుక్కలు చూస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమకు అబ్బాయి పుట్టాలని కోరుకోవడం కూడా ఇందుకు కారణమవుతోంది. ఇదే సమయంలో అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. పెళ్లి సంబంధం రాగానే.. అబ్బాయికి ఉద్యోగంతో పాటు భూములు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండిటికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

డబ్బుకు ప్రాధాన్యం

ఒకప్పుడు పెళ్లంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలనేవాళ్లు. అంతేకాదు.. గుణగణాలను తెలుసుకునేందుకు ఎవరెవరినో విచారించే పరిస్థితి. ఇప్పుడు ఆ ఊసే కరువవుతోంది. అమ్మాయి దొరకడమే కష్టమవుతుండటంతో అటు వైపు నుంచి కూడా ధోరణి మారిపోయింది. అబ్బాయి మంచివాడా, కాదా అనే విషయాలను పక్కనపెట్టి ఆస్తులు, అంతస్తులపైనే దృష్టి సారిస్తున్నారు. పైగా ఒక్కడే కొడుకు ఉంటే మంచిదనే భావన అమ్మాయి తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఉద్యోగంతో పాటు పొలం ఉన్న ఇంటికి తమ అమ్మాయిని పంపేందుకే ఇటీవల కాలంలో ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

ఆ రెండు కులాల్లో అమ్మాయిలు 10 శాతమే..

మ్యారేజ్ బ్యూరోలకు వచ్చే తల్లిదండ్రులు అబ్బాయికి లక్ష జీతం, 10 ఎకరాల పొలం ఉండాలని చెప్పడం పరిపాటిగా మారినట్లు తెలుస్తోంది. మరికొందరు ఉద్యోగం దొరికే వరకు వేచి చూస్తుండటం కూడా పెళ్లిళ్లు ఆలస్యం అవడానికి కారణమవుతోంది. ప్రస్తుతం రెండు కులాల్లో అమ్మాయిల కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ఎంతలా అంటే.. వంద మంది అబ్బాయిలకు 10 మంది అమ్మాయిలు మాత్రమే ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఈ కారణంగా ఓ కులం అబ్బాయిలు ఇతర కులాల అమ్మాయిలు అయినా పర్వాలేదనే నిర్ణయానికి వచ్చేశారు.

అరచేతిలో అన్వేషణ

పెళ్లిళ్ల పేరయ్యలు ఇప్పుడు బాగా తక్కువైపోయారు. ఒకప్పుడు చేతిలో ఒక బ్యాగు వేసుకొని, దాన్నిండా పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలు, అబ్బాయిల ఫొటోలతో తెలిసిన వారి ఇళ్ల ముందు వాలిపోయేవాళ్లు. వీళ్లకు రూ.500, లేదా రూ.1000 ముందుగానే ఇచ్చుకుంటే సంబంధాలు వెతికి పెట్టేవాళ్లు. పెళ్లి సమయంలో కూడా వీళ్లకు అంతోఇంతో ముట్టజెబుతారు. ఇప్పుడు మ్యాట్రిమోనీ సైట్‌లు పుట్టగొడుగుల్లా తెరపైకి రావడంతో అరచేతిలో అన్వేషణ మొదలైంది. ఎవరికి వారు తమ ఫొటో, ప్రొఫైల్ అందులో పెట్టేస్తుండటంతో ఎంతవరకు సరైన వివరాలు ఇచ్చారనే విషయం అంతుచిక్కని పరిస్థితి.



పెళ్లికాని ప్రసాదులే..

సాధారణంగా అమ్మాయిలు వయస్సుకు రాగానే తల్లిదండ్రుల్లో పెళ్లి ఆలోచన మొదలవుతుంది. చదువు పూర్తి అవుతుందనగానే ఆ లోపు తగిన వరుడిని వెతికే పనిలో ఉంటారు. అయితే అబ్బాయిలు మాత్రం చదువుతో పాటు ఉద్యోగంలో స్థిరపడాలనే భావనతో వయస్సునే మర్చిపోతున్నారు. ఈలోపు ఆ వయస్సు అమ్మాయిలకు పెళ్లిళ్లు అయిపోతుండటంతో అబ్బాయిల పరిస్థితి గందరగోళంగా మారుతోంది. వయస్సుకు తగిన అమ్మాయిలు దొరక్క, ఉన్నా వాళ్ల తల్లిదండ్రుల ముందుజాగ్రత్త ప్రశ్నలతో పెళ్లికాని ప్రసాదులుగానే మిగిలిపోతున్నారు. కొన్ని కులాల్లో అమ్మాయిల కొరత అధికంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఎదురు కట్నం ఇచ్చి కూడా పెళ్లి చేసుకుంటున్నారు.




30 ఏళ్ల తర్వాతే..



పెళ్లి వయస్సు బాగా పెరిగిపోతుంది. అబ్బాయి, అమ్మాయి జీవితంలో స్థిరపడటానికే అధిక ప్రా ధాన్యత ఇస్తున్నారు. ఈ కారణంగా 30 ఏళ్ల తర్వాత కానీ పెళ్లిళ్లు జరగడం లేదు. పెద్దల మాటకంటే, తమకు నచ్చితేనే పెళ్లి చేసుకుంటామని చెప్పడం కూడా ఆలస్యానికి కారణమవుతోంది. – చిన్న వెంకటేశ్వర్లు, ఓపిక మ్యారేజ్ బ్యూరో, కర్నూలు

శ్రీమఠం.. ఉత్సవ శోభితం

- శాస్త్రోక్తంగా రాఘవేంద్ర స్వామి ఆరాధన వేడుకలు
- కనుల పండువగా శాఖోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శాఖోత్సవంలో పాల్గొన్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల ఊరేగింపు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు అంగరవైభవంగా సాగుతున్నాయి. పవిత్ర తుంగభద్రా నది తీరంలో వేడుకలు వెలుగులీనుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం విశ్వమోహనుడిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నారు. బుధవారం శ్రీమఠంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో వేకువజాము నుంచే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత రాఘవేంద్రుల మూల బృందావనికి నిర్మల్య విసర్జన, జల, పుష్ప, పంచామృతాభిషేకాలు చేశారు. స్వామి బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే రాఘవేంద్రుల బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగించారు. పూజామందిరంలో స్వామిజీ మూలరామ, వేదవ్యాసుల పూజోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

శాస్త్రోక్తంగా శాఖోత్సవం

వేడుకల్లో భాగంగా రాత్రి 9 గంటలకు ఊంజల మంటపంలో శాఖోత్సవం(కూరగాయలు, ఫలాలు) శాస్త్రోక్తంగా సాగింది. ముందుగా మంటపంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను ఊంజలపై కొలవుంచారు. పండితుల వేద పఠనం చేస్తుండగా దివిటిగి సేవ కనుల పండువగా నిర్వహించారు. కుంకుమ, పుష్పార్చనలు, మంగళ హారతులతో శాఖోత్సవం పూర్తి చేశారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను అంబారి, చెక్క, వెండి, స్వర్ణ, నవరత్న రథాలపై వైభవంగా ఊరేగించారు.

ప్రారంభోత్సవాలు

శ్రీమఠంలో నూతనంగా నిర్మించిన కట్టడాలను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రారంభించారు. శ్రీమఠం ప్రాకారం పైఅంతస్తులో రూ.3 కోట్లతో దాససాహిత్య ప్రాజెక్టు మ్యూజియం ఏర్పాటు చేశారు. నది వైపుగా కొత్తగా రూ.70 లక్షలు వెచ్చించి మరో కారిడార్ నిర్మాణం చేపట్టారు. బుధవారం పీఠాధిపతి శాస్త్రోక్తంగా ఈ కట్టడాలను ప్రారంభించారు.



విశేష అలంకరణలో మూల బృందావనం



దాస సాహిత్య మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యోగీంద్ర మంటపంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బెంగళూరుకు చెందిన విద్వాంసుడు అనుసూయ కులకర్ణి ఆంకులంగ్(వెదురు వాయిద్యం) సంగీత వాయిద్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రసన్న కుమార్ (బెంగళూరు) సంగీత విభావరి వీనుల విందు చేసింది. బెంగళూరు కళాకారిణి కళాబిందు భరతనాట్యం, నృత్యరూపక ప్రదర్శన భక్తులను మైమరిపించింది. వేడుకలో పండిత కేసరి గిరియాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూర్వారాధన

వేడుకల్లో భాగంగా గురువారం పూర్వారాధన జరగనుంది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సింహ వాహనంపై ఊరేగించనున్నారు. రాత్రి యోగీంద్ర మంటపంలో అనుగ్రహ ప్రశస్థి అవార్డుల ప్రదానం ఉంటుంది. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, శతావధాని గరికపాటి నరసింహారావు, పారిశ్రామికవేత్త చంద్రశేఖరన్, ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథ్ అవార్డులు అందుకోనున్నారు.

నేడు మంత్రాలయానికి గవర్నర్ రాక

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం మంత్రాలయం రానున్నారు. ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి హైదరాబాద్ షంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో మధ్యాహ్నం 2.45 గంటలకు కర్నూలులోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుని లంచ్ చేస్తారు. సాయంత్రం 5 గంటలకు రోడ్డుమార్గంలో మంత్రాలయంలోని పద్మనాభతీర్థ అతిథి గృహానికి వస్తారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీమఠం చేరుకుని రాఘవేంద్రస్వామి దర్శించుకోనున్నారు. పీఠాధిపతి సబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా రాయరు అనుగ్రహ ప్రశస్థి అవార్డును స్వీకరిస్తారు. శుక్రవారం ఉదయం మంత్రాలయం నుంచి బయలుదేరుతారు.

పంటలు దెబ్బతినకుండా ప్రణాళిక

- సీఈ కబీర్ బాషా

కర్నూలు సిటీ: కాలువల కింద సాగులో ఉన్న పంటలు దెబ్బతినకుండా ప్రణాళిక తయారు చేసినట్లు జలవనరుల శాఖ సీఈ కబీర్ బాషా తెలిపారు. బుధవారం జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో ఆయా సర్కిళ్ల పర్యవేక్షక ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కబీర్ బాషా మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్లలో నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటితో పంటలు దెబ్బతినకుండా ప్రణాళిక తయారు చేశామన్నారు. వెలుగోడు రిజర్వాయర్‌లో 16.95 టీఎంసీలకుగాను 7.15, గోరుకల్లు రిజర్వాయర్‌లో 12 టీఎంసీలకుగాను 7.20 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని ఇంజినీర్లు సీఈకి వివరించారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలను కాపాడేందుకు ఎంత నీరు అవసరం.. ఎంత నీరు అందుబాటులో ఉంది.. ఈ నీటిని వారాబందీ ప్రకారం అందిస్తే పంటలను ఏ మేరకు కాపాడేందుకు అవకాశం ఉంటుందో పూర్తి వివరాలతో ఓ ప్రణాళికను జల వనరుల శాఖ తయారు చేసిందని సీఈ తెలిపారు. ఈ ప్రణాళికపై రేపు(శుక్రవారం)విజయవాడలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈఎన్‌సీలతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆమోదం తెలపనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో కర్నూలు సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్ రెడ్డి, ఎస్ఆర్‌బీసీ సర్కిల్–1 ఎస్ఈ చెంగయ్యకుమార్, తెలుగుగంగా ఎస్ఈ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా

కర్నూలు(సెంట్రల్): మత్తు పదార్థాల నియంత్రణ, రవాణపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బృందాలతో బార్డర్ చెక్‌పోస్టుల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణ, రవాణాకు సంబంధించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనార్థాలపై జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖాధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ సిఫార్సు లేకుండా మందులను అమ్మకుండా మెడికల్ షాపుల యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు.ఆర్టీసీ బస్సుల్లో మత్తు పదార్థాల రవాణా నివారణ కోసం కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇచ్చినట్లు ఆర్ఎం రామం వివరించారు. కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ కృష్ణకాంత్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీఎఫ్‌ఓ శివశంకర్ రెడ్డి, డీఈఓ రంగారెడ్డి, సీఐ గుణశేఖర్‌బాబు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ లక్ష్మీదేవి, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, కర్నూలు రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పర్వీన్, డీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ మౌర్య

వైభవంగా శ్రీశైల ఆలయ ప్రదక్షిణ



ఆలయప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రావణశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలంలో భ్రమరాంబామల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు బుధవారం ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. వర్షం కారణంగా గిరి ప్రదక్షిణను రద్దు చేసి ఈ కార్యక్రమం చేశారు. ముందుగా సంప్రదాయబద్ధంగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకులు, వేదపండితులు పల్లకీలో ఆశీనులు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో పల్లకీ సేవ జరిపించారు.

క్లుప్తంగా

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పెద్దకడబూరు ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.రాకేష్‌బాబును సస్పెండ్ చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. తనను మోసం చేసి రెండో వివాహం చేసుకున్న తన భర్త రాకేష్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని హోలహర్వి మండలం బాపురం గ్రామంలో ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన(ప్రస్తుతం గార్గేయపురం) అతని భార్య ఎ.గాయత్రి స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి వినతి పత్రం అందించారన్నారు. వినతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డితో పూర్తి స్థాయిలో విచారణ జరిపించి రాకేష్‌ను సస్పెండ్ చేసినట్లు సీఈఓ బుధవారం తెలిపారు. కాగా ఇదే విషయంపై గాయత్రి గతంలో స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయడమే కాకుండా తన బిడ్డ పోషణకు సంబంధించి హైకోర్టును కూడా ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతిచెందిన సందీప్

ఆదోనిఅర్బన్: ఎద్దుల బండిని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన హాన్వాల్–మదిరె గ్రామాల మధ్య బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణంలోని రాయనగర్‌కు చెందిన సందీప్ (28) అనే యువకుడు ఆదోని నుంచి హాన్వాల్ గ్రామానికి బేల్దారి పని చేసేందుకు వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో తిరిగి ఆదోనికి బైక్‌పై వస్తూ హాన్వాల్–మదిరె గ్రామాల మధ్యలో ఎద్దులబండిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.

మహిళ దుర్మరణం


ప్రమాద దృశ్యం


మృతురాలు ఇమాంబీ

శిరివెళ్ల: కర్నూలు– కడప జాతీయ రహదారిపై గోవిందపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గోస్పాడు మండలం కానాలపల్లెకు చెందిన పఠాన్ ఇమాంబీ(54) గోవిందపల్లె వద్ద జాతీయ రహదారి పక్కన టీ దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఆమెను దుకాణం వద్ద వదిలేందుకు అల్లుడు మగ్బూల్ తన రెండేళ్ల కుమారుడితో కలిసి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం నుంచి బయలుదేరాడు. కర్నూలు నుంచి కడప వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇమాంబీ ఎగిరి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. అల్లుడికి, చిన్నారికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ సురేష్ ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మగ్బూల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శాంతిరాం హాస్పిటల్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కౌలు రైతుకు పెట్టుబడి భరోసా

- నేడు వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం విడుదల
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16,486 మందికి ప్రయోజనం
- 2022-23తో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ మందికి లబ్ధి
- బటన్ నొక్కి రూ.7,500 ప్రకారం విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్


హోలహర్వి మండలంలో సాగుదారులకు సీసీఆర్‌కార్డులు ఇస్తున్న మండల వ్యవసాయ అధికారి (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): కౌలురైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వివిధ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోంది. పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) ద్వారా అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. ఈ కార్డులు పొందిన కౌలుదారులకు వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తోంది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో సీసీఆర్ కార్డులు జారీ చేశారు. వీరందరికీ పెట్టుబడి సాయం అందుతోంది. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా పెట్టుబడి సాయాన్ని బటన్ నొక్కి విడుదల చేయనున్నారు.

ప్రత్యేక చట్టం

టీడీపీ హయాంలో కౌలుదారులకు రుణ అర్హత కార్డులు ఇచ్చినా వాటితో ఎలాంటి ప్రయోజనం లభించేది కాదు. ఈ కార్డుపై బ్యాంకులు రుణాలు ఇచ్చేవి కాదు. అలాగే వీరికి ప్రభుత్వ పథకాలు అందేవి కాదు. వ్యవసాయం చేస్తూ నష్టాలు మూటగట్టుకునేవారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కౌలుదారులకు వంద శాతం భరోసా ఇచ్చే పంటసాగుదారు హక్కుల చట్టం-2019 రూపొందించింది. ఏటా ఏప్రిల్ నెలలో ఆర్‌బీకేల వారిగా గ్రామసభలు నిర్వహించి అర్హత కలిగిన సాగుదారులకు సీసీఆర్ కార్డులు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది జూలై నెల చివరి వరకు కార్డులు జారీ చేశారు. ఈ కార్డులతో బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు సైతం అందుతున్నాయి.

రూ.12.36కోట్ల పెట్టుబడి సాయం

ఉమ్మడి జిల్లాలో 877 ఆర్‌బీకేలు ఉండగా రికార్డు స్థాయిలో 39,890 మంది సాగుదారులకు సీసీఆర్ కార్డులు జారీ చేశారు. ఇందులో 16,486 మందికి పెట్టుబడి సాయం అందుతోంది. ఎటువంటి భూమి లేకుండా కౌలుకు భూమి తీసుకొని సీసీఆర్ కార్డు పొందిన వారే పెట్టుబడి సాయం పొందడానికి అర్హులు. వీరికి ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నగదు బదిలీ చేస్తోంది. సాగుదారులకు పెట్టుబడి సాయం రూ.13,500ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. మొదటి విడతలో రూ.7,500 ప్రకారం ఉమ్మడి జిల్లాలో 16,486 మందికి రూ.12,36,45,000 విడుదల కానుంది.

కర్నూలు జిల్లాలో...

కర్నూలు జిల్లాలో 2022-23లో 6,960 మంది సాగుదారులకు మాత్రమే సీసీఆర్ కార్డులు జారీ అయ్యాయి. వీరిలో 3,044 కౌలుదారులకు రూ.13500 ప్రకారం రూ.4,10,94,000 పెట్టుబడి సాయం లభించింది. 2023–24లో 18,020 సీసీఆర్, కార్డులు జారీ అయ్యాయి. ఇందులో భూమి లేని సాగుదారులు 6,965 మందికి మొదటి విడతలో రూ.7500 ప్రకారం రూ.5,22,37,500 పెట్టుబడి సాయం అందుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 3,921 మంది సాగు దారులకు అదనంగా ప్రయోజనం కలుగుతోంది.

నంద్యాల జిల్లాలో...

నంద్యాల జిల్లాలో గత ఏడాది 12,276 సీసీఆర్ కార్డులు జారీ చేశారు. ఈ ఏడాది 21,870 మందికి కార్డులు జారీ చేశారు. ఇందులో స్వంతభూమి సెంటు కూడా లేని సాగుదారులు 9,521 మంది ఉన్నారు. వీరందరికీ వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందుతోంది. మొదటి విడతలో రూ.7,500 ప్రకారం మొత్తం రూ.7,14,07,500 వారి బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. గత ఏడాది 4,670 మంది సాగుదారులకు ప్రయోజనం లభించగా.. ఈ ఏడాది అదనంగా 4,851 మంది సాగుదారులకు ప్రయోజనం కలుగుతోంది.

అర్హులందరికీ ప్రయోజనం



అర్హత కలిగిన సాగుదారులకు వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కర్నూలు జిల్లాలో 6,965 మంది సాగుదారులకు రూ.5.22 కోట్లు పెట్టుబడిసాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. గత ఏడాది కంటే 3,921 మందికి అదనంగా ప్రయోజనం కలుగుతోంది.

–పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు

ఎంతో ఉపయోగకరం



మాకు ఎటువంటి పొలం లేదు. గతేడాది రెండున్నర ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాం. ప్రభుత్వం సీసీఆర్ కార్డు కూడా జారీ చేసింది. ఈ కార్డుపై వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.1,3500 పెట్టుబడి సాయం అందచేసింది. ఈ ఏడాది కూడ కౌలుకు తీసుకున్న భూమికి ప్రభుత్వం సీసీఆర్ కార్డు జారీ చేసింది. గురువారం బ్యాంకు ఖాతాకు మొదటి విడతలో రూ.7500 ప్రకారం పెట్టుబడి సాయం జమ కానుంది. ఇది మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– నాగమద్దయ్య, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

మంత్రాలయంలో భారీ బందోబస్తు


బందోబస్తు విధుల్లో పాల్గొననున్న పోలీసులు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలలో భాగంగా మంత్రాలయంలో భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 200 మంది కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, 100 మంది ఆర్మీ ఫోర్స్, రెండు గ్రూపుల ఏపీఎస్‌పీ బెటాలియన్, బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. గురువారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రాక సందర్భంగా ప్రత్యేక బందోబస్తు చేపట్టామన్నారు. బుధవారం స్థానిక భూరమణ కల్యాణ మండపంలో భద్రత ఏర్పాట్లపై పోలీసులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. బందోబస్తు విధుల్లో పోలీసు సిబ్బంది బాధ్యతగా నడుచుకోవాలన్నారు. నాగలదిన్నె నుంచి వచ్చే భక్తులు శ్రీమఠం పార్కింగ్, ఎమ్మిగనూరు వైపు నుంచి వచ్చే భక్తులు ఆర్టీసీ బస్టాండ్ గ్రౌండ్, ప్రభుత్వ పాఠశాల ప్రదేశాలలో వాహనాలను ఉంచాలన్నారు. మాధవరం నుంచి వచ్చే వాహనాలను శ్రీమఠం హెలిప్యాడ్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలన్నారు.

పోలీసు అధికారులకు ఎస్పీ ప్రశంస


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కర్నూలు: జిల్లాలో పండుగలు, ర్యాలీలు, వీవీఐపీ సమావేశాలలో ముందుచూపుగా, చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎస్పీ కృష్ణకాంత్ అభినందనలు తెలిపారు. కర్నూలు నగరంలో ఇటీవల బక్రీద్, రంజాన్ తదితర పండుగను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా ప్రజలందరూ వినాయకచవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో కలసి మెలసి చేసుకుంటూ సోదర భావంతో మెలగాలని ఎస్పీ సూచించారు. ఇందులో భాగంగా విధుల్లో ప్రతిభ కనపర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ కృష్ణకాంత్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కర్నూలు టౌన్ డీఎస్పీ విజయశేఖర్, ఒకటో పట్టణ సీఐ నాగశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ మౌలాలి, హెడ్ కానిస్టేబుల్ సాదిక్ తదితరులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ టి.సర్కార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, కర్నూలు త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15లోగా వంద శాతం ఈ-క్రాప్ బుకింగ్


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటలను సెప్టెంబర్ 15లోపు వంద శాతం ఈ–క్రాప్‌లో నమోదు చేయడంతో పాటు ఈ–కేవైసీ కూడా పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇప్పటి వరకు ఈ–క్రాప్ బుకింగ్ 37 శాతం అయిందని.. ఈ వారాంతంలోగా 50 శాతం పూర్తి కావాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జీయో ఫెన్సింగ్‌లో పంట ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన రైతుల పంటలను కూడా నమోదు చేయాలని పేర్కొన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలుదారులకు వ్యక్తిగతంగా రుణాలు ఇవ్వడం సాధ్యం కాకపోతే జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించాలన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్ల పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని, పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేసి భూమి పూజకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలను సత్వరం పూర్తి చేయడంపై దృష్టి సారించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామచంద్రయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణమూర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి


మృతి చెందిన డాక్టర్ పి.మల్యాద్రి

కర్నూలు సిటీ: శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పచ్చా మాల్యాద్రి అనారోగ్యంతో మరణించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 33 ఏళ్లకుపైగా విద్యాభివృద్ధికి కృషి చేసిన ఆయన 2015 జూలై నుంచి 2018 ఆగస్టు వరకు ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత సాంఘిక శాస్త్రంలో పరిశోధనలను ప్రోత్సహించడానికి ఏర్పాటైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సీనియర్ రీసెర్చ్ ఫెలోగా 8 ఏళ్ల పాటు సేవలు అందించారు.

- 8 పుస్తకాలను రచించడంతో పాటు ఆయన రాసిన 152 పరిశోధన పత్రాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి.
- మాల్యాద్రి నేతృత్వంలో 14 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు, 18 మందికి ఎంఫిల్ డిగ్రీలు వివిధ విశ్వ విద్యాలయాల నుంచి ప్రదానం చేశారు.
- 360 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ఎడిటోరియల్ బోర్డు మెంబర్‌గా వ్యవహరించారు.
- రెండు మేజర్ ప్రాజెక్టులపై పరిశోధనలు చేసి న్యూఢిల్లీలోని యూజీసీకి రిపోర్ట్ చేయడంతో న్యాక్ పీర్ టీం సభ్యులుగా, మినిస్ట్రీ ఆఫ్ మైనార్టీ అఫైర్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు ఇన్‌స్పెక్టింగ్ ఆథారిటీగా సేవలు అందించారు.
- సీఎస్ఆర్ ఫండ్స్ కింద గ్యాస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నుంచి రూ.55 లక్షలు, అరబిందో ఫార్మా నుంచి రూ.3.70 కోట్లు మంజూరు చేయించి తెలంగాణలోని తాండురూ, పటాన్ చెరువులో నూతన ప్రభుత్వ కాలేజీలను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు.
- ఒక వైపు విద్యాభివృద్ధి, మరోవైపు పరిశోధన రంగాలలో చేసిన సేవలకు 2008లో అప్పటి సీఎం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.
- అదే విధంగా రాజీవ్‌గాంధీ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు సైతం ఆయనను వరించింది.


స్టేషన్ బయట ఉన్న పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

235 మంది మహిళలు రాత పరీక్షకు ఎంపిక


అభ్యర్థినులకు సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్


ఎత్తును పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు: పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో ఐదవ రోజు సామర్థ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షణలో 700 మంది మహిళా అభ్యర్థులను ఆహ్వానించగా 449 మంది హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, బరువు కొలతలు నిర్వహించారు. అనంతరం వారందరికీ సామర్థ్య పరీక్షలు(ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్) 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు చేపట్టారు. వీరందరిలో 235 మంది మహిళా అభ్యర్థులు తుది రాత పరీక్ష (మెయిన్స్)కు ఎంపికయ్యారు.





నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి


- మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులపై సత్వరమే స్పందించాలి
- పోలీసులకు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశం

జూపాడుబంగ్లా: నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసులకు ఆదేశించారు. బుధవారం ఆయన జూపాడు బంగ్లా పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలతో పాటు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పట్టుబడిన వాహనాలను కోర్టులో సరెండర్ చేసి వాటి యజమానులకు అప్పగించేందుకు యత్నించాలని ఎస్ఐలకు సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. స్టేషన్ పరిధిలో జరిగే దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు రాత్రి గస్తీ పెంచాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన జూదం, మట్కా, రేషన్ బియ్యం తరలింపు, నాటుసారా తయారీ, అమ్మకం, బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులపై సత్వరమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నెట్టింట్లో రాయరు వైభవం!

- సాంకేతికం వైపు శ్రీమఠం అడుగులు
- భక్తుల కోసం ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- మంత్రాలయ వాహిని పేరుతో యూట్యూబ్ చానెల్
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లోనూ లైవ్ ప్రోగ్రామ్స్


శ్రీమఠం ముఖద్వారంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్



మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఆన్‌లైన్‌లోనూ భక్తులను సేవలు అందిస్తోంది. మఠంలో నిత్యం జరిగితే పూజాది కార్యక్రమాలు ఆన్‌లైన్‌లోనూ ప్రసారం చేస్తోంది. అలాగే ప్రముఖుల దివ్య సందేశాలు, ధార్మిక విషయాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలను భక్తకోటికి చేరవేస్తోంది. ఇంట్లో కూర్చుని శ్రీమఠంలో జరిగే వేడుకలను తిలకించే భాగ్యాన్ని భక్తులకు కల్పించింది. ఈ ప్రక్రియను నిర్విరామంగా నడిపేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో నడుపుతున్న యూట్యూబ్ చానెల్, సోషియల్ మీడియా నెట్‌వర్క్‌పై సాక్షి ప్రత్యేక కథనం

డిజిటల్ కెమెరాల ఏర్పాటు

భక్తుల కల్పతరువుగా దేశవిదేశాల్లో మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఖ్యాతి గడించారు. దేశమంతటా రాయరు భక్తులు కోట్లాదిగా ఉన్నారు. దేశవ్యాప్తంగా 40కి పైగా మృత్తికా బృందావన బ్రాంచ్‌లు ఉన్నాయి. సుదూరంలో ఉన్న భక్తజనుల కోసం శ్రీమఠం సరికొత్తగా సోషియల్ మీడియా వైపు అడుగులు పెట్టింది. సాంకేతిక మాధ్యమాల్లో లైవ్ ప్రోగ్రాం కోసం ప్రత్యేకంగా నాలుగు డిజిటల్ కెమెరాలు ఉన్నాయి. గర్భగుడిలో రాఘవేంద్రుల మూల బృందావనం, పూజామందిరంలోని మూలరాముల పూజ, ఆలయ ముఖద్వారంలోని కారిడార్, ఆలయం ప్రాంగణంలో రథోత్సవాల వీక్షణం కోసం కెమెరాలు అమర్చారు. నెట్‌వర్క్ కోసం రూ.1.25 లక్షలు విలువజేసే కంప్యూటర్ (1 టీబీ కెపాసిటీ), రూ.60 వేలు విలువైన కంప్యూటర్స్ మీడియా పాయింట్ గదిలో ఉంచారు. శ్రీమఠానికి వచ్చిన భక్తులు లైవ్ వీక్షించేందుకు మూడు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. శ్రీమఠం ముఖద్వారంతో రూ.10 లక్షలతో (స్క్రీన్ వెడల్పు 20, ఎత్తు 10 అడుగులు), పీఠాధిపతి గదిపైన, దక్షిణం వైపు ప్రాకారాలపై రూ.12 లక్షలతో రెండు స్క్రీన్ (వెడల్పు 12 అడుగులు, ఎత్తు 8 అడుగులు)లు అమర్చారు. శ్రీమఠం గర్భాలయ దక్షిణ భాగంలో మీడియాపాయింట్ నుంచి నెట్‌వర్క్ రన్ చేస్తున్నారు.

ప్రసారమయ్యే కార్యక్రమాల వివరాలు..

ఉదయం 7 గంటలకు మూలబృందావన అభిషేకం, పాదపూజ లైవ్ ఉంటుంది. మధ్యాహ్నం పూజా మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నిర్వహించే మూలరాముల సంస్థాన పూజ, మహా మంగళహారతి ప్రసారం చేస్తారు. రాత్రి మఠం ప్రాకారంలో జరిగే రథోత్సవాలు, ఊంజల సేవ లైవ్‌లో ఉంటుంది. అంతేగాక రాఘవేంద్రస్వామి ఆరాధన సప్తరాత్రోత్సవాలు, గురుభక్తి వైభవోత్సవాలు, దాస సాహిత్య కార్యక్రమాలు, పండితుల ప్రవచనాలు సైతం ప్రసారం చేస్తారు. శ్రీమఠం మీడియా ఇన్‌చార్జ్‌గా కరణం మండగిరి శ్రీనిధి వ్యవహరిస్తుండగా మరో ఇద్దరు కెమెరామెన్లు పనిచేస్తున్నారు.

భక్తుల కోసమే ఆన్‌లైన్ ప్రసారాలు

మహిమాన్విత యతిశ్రేష్టి రాఘవేంద్రస్వామికి దేశ విదేశాల్లోనూ భక్తులు ఉన్నారు. భక్తుల సౌకర్యార్థం యూట్యూబ్ చానెల్‌తోపాటు సామాజిక మాధ్యమాల్లో శ్రీమఠం కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాం. లక్షలాది మంది భక్తులు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించి స్వామి సేవలో తరిస్తున్నారు.

– సుబుధేంద్రతీర్థులు, శ్రీమఠం పీఠాధిపతి


యూట్యూబ్‌లో లైవ్ ప్రోగ్రాం

సామాజిక మాధ్యమాలు ఇవే..

ఫేస్‌బుక్‌లో (sriraghavendraswamymutt)పేరుతో చానెల్ నడుపుతున్నారు. అందులో 2.50 లక్షల మంది ఫాలోవర్స్ కలరు. ట్విట్టర్‌లో (srs mutt)పేరుపై టెలీకాస్ట్ చేస్తుండగా 70 వేల మంది ఫాలో అవుతున్నారు. ఇన్‌స్టాగామ్‌లో (srs mutt)వెబ్‌సైట్ నడుపుతుండగా 50 వేల మంది వీక్షిస్తున్నారు. యూటూబ్‌లో mantralamvahini పేరుతో ప్రత్యేక చానెల్ నడుతుపుతున్నారు. అందులో 85 వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. అలాగే అధికారిక వివరాలు, సేవలు, రూమ్స్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ (srsmutha.org)పెట్టారు. సైట్‌లోనే సేవల బుకింగ్, రసీదులు పొందవచ్చు.


శ్రీమఠం మీడియా సెంటర్ విభాగం